
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.6 కనిష్ఠం 24.8
కామారెడ్డి జిల్లా వార్తలు
5
గురువారం 11 ఏప్రిల్ 2024



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

దోమకొండ, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి 26వ వార్షికోత్సవ ఉత్సవాలకు హాజరు కావాలని బుధవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డికి పెద్దమ్మతల్లి కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 21 వరకు శ్రీ వనదుర్గ పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవ ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, సత్యం, రాజు, రవి, నర్సింలు, కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.




జోరుగా పొరుగు

మద్యం అమ్మకాలు!



- జిల్లాలోకి అంతర్ రాష్ట్ర లిక్కర్
- సరిహద్దు దాటుతున్న అక్రమ మద్యం
- ప్రైవేట్ వాహనాల్లో రవాణా
- బాన్సువాడలోని ఓ మద్యం వ్యాపారి నిర్వాకం
- బార్లలో, వైన్స్‌లలో విచ్చలవిడిగా అమ్మకాలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు శాఖలు



కామారెడ్డి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో పొరుగు రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలే కాకుండా వివిధ ప్రాంతాలకు అక్రమంగా మద్యం పెద్దఎత్తున తరలివస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలతో పాటు గోవా నుంచి మద్యం పెద్ద ఎత్తున తరలివస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. లోక్‌సభ ఎన్నికల వేళ జిల్లాకు చెందిన మద్యాన్ని పంచితే ఖర్చు ఎక్కువ అవుతుందనే భావనతో పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి లిక్కర్‌ను తీసుకువచ్చి అమ్మడమే కాకుండా ఎన్నికల్లో పంచేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది. బాన్సువాడలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌ను నిర్వహించే మద్యం వ్యాపారి పొరుగు రాష్ట్రాల మద్యాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల తన బార్‌లోనే కాకుండా ప్రైవేట్ ప్లేస్‌లలోనూ గోవా మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు, ఎక్సైజ్‌కు ఫిర్యాదు వెళ్లినా పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల లిక్కర్‌నే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దేశిదార్‌ను అక్రమంగా రవాణా చేసి ఎన్నికల్లో పంచేందుకు ప్రైవేట్ ప్రాంతాల్లో భారీగా డంప్‌లు పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు వెళ్లినా పట్టించుకోకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

ఓ మద్యం వ్యాపారి అక్రమ లిక్కర్ దందా

బాన్సువాడలోని ఓ మద్యం వ్యాపారి అక్రమ లిక్కర్ వ్యాపారం జరుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరు నేతల అండతో సదరు వ్యాపారి ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని విక్రయించడమే కాకుండా భారీగా దేశిదార్ డంప్‌లు చేసి ఎన్నికల్లో పంచేందుకు సిద్ధంగా ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. సదరు మద్యం వ్యాపారి బాన్సువాడలో బార్ అండ్ రెస్టారెంట్ నడుపుతున్నాడు. సదరు మద్యం వ్యాపారి బార్‌ను సమయపాలన పాటించకుండా అర్ధరాత్రి వరకు అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. లోకల్ మద్యమే కాకుండా గోవా, మహారాష్ట్ర, విదేశాలకు చెందిన మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల తన బార్‌లో ఇతర రాష్ట్రానికి చెందిన కొన్ని మద్యం బాటిల్‌లు ఉన్నాయని ఎక్సైజ్, పోలీసు శాఖలకు ఫిర్యాదులు వెళ్లినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో సదరు అధికారులు బార్‌లో తనిఖీలు చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా దేశిదార్‌ను సైతం సదరు మద్యం వ్యాపారి అక్రమంగా అక్రమాలు జరుపుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి.

చెక్‌పోస్టులు ఉన్నా గుట్టుగా తరలింపు

మద్యం వ్యాపారులు పొరుగు రాష్ట్రాల నుంచి లిక్కర్‌ను గుట్టుగా తరలిస్తున్నారు. గోవాలో లిక్కర్ తక్కువ ధరకు దొరుకుతుండడంతో గోవా మద్యాన్ని జిల్లాకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులు లిక్కర్‌ను గోవా నుంచి మహారాష్ట్ర రాజధాని ముంబాయికి తరలిస్తూ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వాహనాల ద్వారా లిక్కర్‌ను పంపిస్తారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నామ మాత్రంగా ఉంటుండడంతో ఇక్కడకు తరలించేందుకు సులువుగా మారింది. ఎన్నికల వేళ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరంగా జరగడం, ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు చేపడుతుండడంతో గుట్టుగా మహారాష్ట్ర ప్రాంతాల్లోని గ్రామాల గుండా జిల్లాలోకి తీసుకువస్తున్నారు. ఇక్కడ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా ఇందులో ఏడాది నుంచి పదేళ్ల పాటు నిల్వ చేసిన మద్యాన్ని వ్యాపారులు అమ్మకాలను సాగిస్తున్నారు. గతంలో బాన్సువాడ, కామారెడ్డి, బీబీపేట, పిట్లం తదితర ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల, జిల్లాలకు చెందిన మద్యం పెద్దఎత్తున పట్టుబడిన కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలో ఏరులై పారుతోంది.

ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా

ఇతర రాష్ట్రాలైన గోవా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మద్యం జిల్లాలో నిషేధం ఉంది. కేంద్ర పాలిత ప్రాంతమైన గోవాకు విదేశీయులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వారు టూరిస్టులుగా వెళ్తారు. టూరిస్టులను ఆకర్షించేందుకు గోవాలో లిక్కర్‌పై పన్ను తక్కువగా వసూళ్లు చేయిస్తుండడంతో బీర్లు, విస్కీ, బ్రాండీలు తక్కువ ధరకే లభిస్తాయి. దీన్ని క్యాష్ చేసుకునేందుకు జిల్లాకు చెందిన వ్యాపారులు మహారాష్ట్ర గుండా జిల్లాకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లిక్కర్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించడంపై నిషేధం ఉన్న వాహనాల్లో అక్రమంగా జిల్లాకు తీసుకువస్తున్నారు. అంతేకాకుండా మహారాష్ట్ర నుంచి దేశిదారు, ఇతర లిక్కర్ తక్కువ ధరకు దొరకడం ద్వారా సరిహద్దు గ్రామాలకు చెందిన వారు మహారాష్ట్ర నుంచి లిక్కర్‌ను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం.

పార్లమెంట్ ఎన్నికలను

సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి, అనుమతులు, ఫిర్యాదులపై స్పందించుట, అక్రమ డబ్బు, మద్యం, కానుకల వంటివి స్వాధీనపరుచుట తది తర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థి చేసే ప్రతీ ఖర్చు లెక్కలో చూపాల్సి ఉంటుందని తెలిపారు. ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలో ప్రధానంగా ముందస్తు అనుమతులు లేని వాహనాలు, సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లతో పాటు డబ్బు, మద్యం, బహుమతులు తరలించుటపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోడ్ ఉల్లంఘన, అక్రమ డబ్బు, మద్యం తరలింపుపై కేసులు నమోదు చేసి రోజువారి నివేదికలు సమర్పించాలని తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై తక్షణమే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమాచార మందించాలని తెలిపారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా పని చేయాలని తెలిపారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్యవార్తలకు తక్షణమే స్పందించి అట్టివార్తలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. చెల్లింపు వార్తలపై దృష్టి పెట్టాలని, కరపత్రాలు, ఫ్లెక్సీలు వంటివి ముద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచారం ప్రకటనలు, ప్రచార అంశాలు, ఎల్ఈడీ, డిస్‌ప్లే తదితర వాటికి ఎంసీఎంసీ ద్వారా అనుమతులు జారీ చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ప్రక్రియ సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన వారికి ఎలాంటి మినహాయింపు లేదని, హాజరు కాని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, ఉద్యోగులు ఎవరు రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణపై ప్రకటన వెలువడిన నాటి నుంచి నేటి వరకు 50లక్షల నగదుతో పాటు 41 లక్షల విలువగల మద్యం స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులుగా గోపాలజీ తివారి, పోలీసు పరిశీలకులుగా దీపక్ భార్గవ్‌లను ఎన్నికల కమిషన్ నియమించిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, నోడల్ అధికారులు వరదారెడ్డి, శ్రీనివాస్, అంబాజీ, శ్రీనివాస్‌రెడ్డి, రాజారాం, ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల పర్యవేక్షకులు ప్రేమ్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని, జ్యోతి, స్వప్న, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈద్-ఉల్-ఫితర్

- ముగిసిన రంజాన్ ఉపవాస దీక్షలు
- ప్రత్యేక నమాజ్ ప్రార్థన కోసం ముస్తాబైన ఈద్గాలు



నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 10 : పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు నియమ నిష్ఠలతో చేపట్టిన ఉపవాస దీక్షలు బుధవారం నాటితో ముగియడంతో ముస్లింలు గురువారం రంజాన్ పండుగ అయిన ఈద్-ఉల్-ఫితర్‌ను ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం శవ్వాల్ మాసపు నెల వంక బుధవారం రాత్రి దర్శనమివ్వడంతో శవ్వాల్ మాసపు మొదటి తేదీన ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్‌ను జరుపుకోనున్నారు. ఈ రంజాన్ పర్వదినం రోజున గ్రామాల్లోని పొలిమేరల్లో ఉన్న ఈద్గాల వద్ద వెళ్లి వందలాది మంది ముస్లింలు ఒకే చోట చేరి సామూహిక ఈద్ నమాజ్ ప్రార్థనలు చేస్తారు. ఈద్గాలకు వెళ్లలేని వారు ఆయా మసీదుల వద్ద ఈద్ నమాజ్ ప్రార్థనలు చేస్తారు. ఉపవాస దీక్షలు చేపట్టి తమలోని చెడు గుణాలను వదిలేసి, సుగుణాలను పెంపొందించుకుని ప్రతినిత్యం ఖురాన్‌ను పఠిస్తూ, తరావి ప్రత్యేక ప్రార్థనలతో గడిపిన భక్తికి పరిపూర్ణత లభించే పండుగే రంజాన్. రంజాన్ పండుగ రోజున ముస్లింలు ఉదయాన్నే వేకువ జామున లేచి గుసుల్ స్నానం ఆచరిస్తారు. ప్రతీ ముస్లిం ఇంట్లో ఉదయం నుంచి పండుగ సందడి ప్రారంభమవుతోంది. నూతన వస్త్రాలు ధరించి, సుగంధ ద్రవ్యాలు చల్లుకుని, కండ్లకు సుర్మా పెట్టుకుని, తలకు టోపి ధరించి ముస్లింలందరూ కలిసి సామూహిక ప్రార్థనల కోసం ఈద్గాలకు వెళ్లి ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ చేస్తారు. మత గురువులు, ఇమాంలు ప్రత్యేక నమాజ్‌ను చదివిస్తారు. అనంతరం సర్వ మానవాళిపైన కరుణ, దయ చూపాలని, అందరినీ ఆనందంగా, సుఖ సంతోషాలతో ఉంచాలని, ప్రతీ ఒక్కరి కష్టాలను తొలగించాలని, నరకం నుంచి విముక్తి కలిగించాలని, స్వర్గాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. నమాజ్ ప్రార్థనల అనంతరం కుల మతాలకు అతీతంగా ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు చెబుతారు. ఈద్గాలకు వెళ్లేటప్పుడు ఒక దారి నుంచి వెళ్లి, వచ్చేటప్పుడు వేరే దారి గుండా ఇండ్లకు తిరిగి వస్తారు.

ముస్తాబైన ఈద్గాలు

రంజాన్ ప్రత్యేక నమాజ్ ప్రార్థనల కోసం ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలన్నీ ముస్తాబయ్యాయి. ఈద్గాలలో ఒకేసారి వందలాది మంది ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేయనుండటంతో ఈద్గాలను శుభ్రం చేసి, ఈద్గాల వద్ద టెంట్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్దకు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వెళ్లి ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపనున్నారు.

రంజాన్ ప్రత్యేక వంటకం షీర్ కుర్మా

రంజాన్ పండుగ రోజు ముస్లింలు చేసే ప్రత్యేక వంటకం షీర్ ఖుర్మా ప్రతీ ముస్లిం ఇంటిలో రంజాన్ పండుగ నాడు సేమియాలు, పాలు, చక్కెర, నెయ్యి, డ్రై ఫ్రూట్స్‌తో కలిపి తయారు చేసే షీర్ ఖుర్మా (పాయాసం) ప్రత్యేక వంటకం తయారు చేస్తారు. ఇది ఎంతో రుచికరంగా ఉంటుంది. పండుగ సందర్భంగా ఇంటికి వచ్చే అతిథులందరికీ ఈ రుచికరమైన షీర్ ఖుర్మాను తినిపించి పంపిస్తారు.



షీర్ ఖుర్మాకు

కార్యకర్తలు కష్టపడితేనే

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

బిచ్కుంద, ఏప్రిల్ 10: పది సంవత్సరాలుగా కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని వీడకుండా సైనికుల్లా కష్టపడి పని చేస్తేనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సద్గురు బండాయప్ప స్వామి కల్యాణ మండపంలో జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబపాలన చూసిన రాష్ట్ర ప్రజలు నియంత పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని ఈ అవకాశాన్ని అహంకారంతో కాకుండా ప్రజలు మెచ్చేలా అందిస్తామన్నారు. ఆనాడు ఇందిరాగాంధీ వ్యవసాయపరంగా పేద రైతులు భూమి సాగు చేసుకుని జీవించేందుకు లక్షల ఎకరాలు భూ పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నేటికి రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు దర్శనమిస్తాయన్నారు. దొంగ వాగ్దానాలతో అధికారం చేపట్టిన కేసీఆర్ జుక్కల్ నియోజకవర్గంలో దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్‌బెడ్‌రూం ఎక్కడ కట్టించారని అన్నారు. వందేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ అధికారం కోసం ఆరాటపడలేదని బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సే ధ్యేయంగా ఆనాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 60 ఏళ్ల ప్రత్యేక తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను రాష్ట్ర ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిసిన రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సోనియాగాంధీ నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాగానే ఐదు గ్యారెంటీల్లో 25 పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలు ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. గత ఎమ్మెల్యే లాగా పదవిని అడ్డుపెట్టుకుని అక్రమ సంపాదన చేసే వ్యక్తిని కాదని నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి చేరేలా కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ అప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ఓటరు నమోదుకు

ఈ నెల 15 వరకు గడువు పొడిగింపు



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

మద్నూర్, ఏప్రిల్ 10: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం కల్పించింది. పోలింగ్ శాతం పెంచేందుకు యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఇంతకు ముందు కూడా పలుమార్లు ఓటరు నమోదు చేపట్టినా స్పందన రాలేదు. విద్యా, ఉద్యోగాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి వీలు కావడం లేదు. దీంతో వారు ఎక్కడ ఉన్నా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈసీ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం విద్యా సదస్సుల్లో అవగాహన కల్పించినా పలువురు తమ ఓటును నమోదు చేసుకోవడానికి నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటి వరకు పేర్లు నమోదు చేసుకోని వారికి మరో అవకాశం కల్పించింది. ఏప్రిల్ 1నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక దృష్టిని సారించింది. ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గకుండా పేర్లు నమోదు చేసుకునేలా జాగృతి చేస్తోంది. జాబితాలో మార్పులు, చేర్పులు, అనర్హుల పేర్లను తొలగించేందుకు అవకాశం కల్పించారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలు, ఆన్‌లైన్‌లలో నమోదు తదితర వాటిపై బీఎల్‌వోలకు ఆదేశించారు.

యువతీ, యువకులకు అవగాహన

యువతను చైతన్యం చేసి పేర్లను నమోదు చేసుకునేలా ఎన్నికల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యువతీ, యువకులకు ఓటు ఆవశ్యకత, తదితర వాటిపై అవగాహన కల్పించినట్లు మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. 2024, ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చు

ఓటు హక్కు నమోదుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, ఓటు కావాల్సిన వ్యక్తి ఫోన్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ న్యూ ఓటర్‌పై క్లిక్ చేస్తే ఫారం 6 అప్లికేషన్ ఫాం ఫర్ న్యూ ఓటర్స్ నింపితే కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భాండాగారాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్10: గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భండాగారాలు అని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శాఖ గ్రంథాలయానికి రెండు కూలర్లను అందజేశారు.ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ వేయడంతో గ్రంథాలయానికి అధిక సంఖ్యలో వస్తున్నారని, ఎండ వేడిమిలో ఉపశమనం కోసం కూలర్లను అందజేశామన్నారు. గ్రంథాలయాల్లో ఆధునిక పుస్తకాలతో బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు యార్లగడ్డ శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్ రావు, రాధాకృష్ణ మూర్తి, శ్రీనివాస రాజు, లక్ష్మీకాంత్ రెడ్డి, గాంధీ, హరిబాబు, ఐఆర్ చక్రవర్తి, రమణ రెడ్డి, నర్సారెడ్డి, గ్రంథాలయ పాలకులు రమా, సిబ్బంది తదితరులున్నారు.


గ్రంథాయానికి కూలర్లు అందజేస్తున్న దృశ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం

● జిల్లా కోర్టులో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 10: జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయసేవా సంస్థ ఛైర్‌పర్సన్, ప్రధాన న్యాయాధికారిణి సునీత కుంచాల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని మన ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చిన్న చిన్న పరీక్షలను చేసుకోవడంలో నిర్లక్ష్యం సరికాదని కనీసం సంవత్సరానికి రెండు సార్లైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, పలు రకాల వైద్య పరీక్షలు డాక్టర్ నాగనాథ్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు, బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, న్యాయసేవా సంస్థ సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్10: మున్సిపల్ పరిధిలోని గురువారం జరిగే రంజాన్ పండగ సందర్భంగా ముస్లీం సోదరీ సోదరీమణులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని ఈ సందర్భంగా ససూచించారు.

పంటనష్ట పరిహారాన్ని చెల్లించాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు

పెద్దబజార్, ఏప్రిల్ 10: పంటనష్ట పరిహారాన్ని వెంటనే సర్వే నిర్వహించి చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంట నేలకొరిగి గింజలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అదేవిధంగా వర్షాభావ పరిస్థితుల మూలంగా ఎండిపోయిన పంటలను వ్యవసాయ అధికారులు వెంటనే సర్వేలు నిర్వహించి పరిహారాన్ని లెక్కకట్టి రైతులకు ఎకరానికి 25వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ముప్కాల్, ఏప్రిల్10: ముస్కు రాజ్‌కుమార్ ప్రథమ పుత్రిక ఆరాధ్యరెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం కిసాన్‌నగర్‌లోని సచికేతన్ ఆవాసంలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్కు రాజేశ్వర్, సెక్రెటరీ కట్ట మహేష్, జక్కుల రాము, లింగపురం శ్రీనివాస్, సిద్ద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవ పురస్కారం అందజేసిన జడ్పీచైర్మన్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్10: పట్టణంలోని సవేరగ్యాస్ ఏజెన్సీలో విశ్వతేజస్ జాయింగ్ కౌన్సిలింగ్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవ పురస్కారాన్ని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు భారత్‌గ్యాస్ సుమన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ గత 20ఏళ్ల నుంచి అనేక సమాజిక సేవలు చేస్తూ సిద్దులగుట్టలోని శివాలయం, రామాలయంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన భారత్‌గ్యాస్ సుమన్‌కు ఉత్తమ సేవ పురస్కార అవార్డు అందజేయడం అభినందనీయ మన్నారు. అనంతరం పట్టుశాలువ పూలమాలతో సుమన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెజిషియన్ రంగనాథ్, మోటివేషనల్ స్పీకర్ సైకాలజిస్ట్ తిరునగరి శ్రీహరి, కళాకారులు, ప్రముఖ వైద్యులు, పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 10:జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జిల్లా జడ్జి సునీత కుంచాల చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు, ప్రజలకు వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు వెలమ సంఘం ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, వెలమ సంఘం అధ్యక్షుడు కిశోర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, జీపీ శ్రీహరిఆచారి, మాజీ పీపీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కదిలిందా.. బతుకు గోవిందా!


రైలు కింద నుంచి ప్రమాదభరితంగా వెళ్తున్న పలు గ్రామాల ప్రజలు


రైలు పట్టాలను దాటుతున్న మహిళలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 10: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి పక్కన గల ఘన్‌పూర్, ముల్లంగి, కులస్‌పూర్, గ్రామాలకు వెళ్లే గ్రామీణ ప్రజలు పలు శాఖాల్లో పనిచేసే అధికారులు పిల్లపాపలతో వెళ్లే గ్రామాల ప్రజలు నిత్యం ఆగి వున్న రైలు కింది నుంచి ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఫుట్ ఓవర్ వంతెన లేక ఇలా ప్రమాదకరంగా వెళ్లడం ఈ గ్రామాల ప్రజలకు పరిపాటిగా మారింది. గత రెండు రోజులుగా మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ లో రైలు నిలిపివుంచడంతో గ్రామీణ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల రైల్వే ఉన్నతాధికారులకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై గ్రామీణ ప్రజలు వినతి పత్రాలు అందజేసిన అధికారులు మాత్రం ఏలాంటి నిర్ణాయం తీసుకోకపోవడంతో రైల్వే అధికారులపై గ్రామస్థులు మండిపడుతున్నారు. వెంటనే వంతెన ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెంచడం నరకడానికా..!

రుద్రూరు, ఏప్రిల్ 10 : రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటాలన్న సదుద్దేశం తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెట్లను పెంచుతున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పెద్దగా పెరిగిన చెట్లను విద్యుత్ తీగలకు తాకే ప్రమాదం ఉందని చెప్పి ఆ పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు. ఏళ్ల తరబడి పెంచిన ఆ చెట్లను అప్పుడే నరికివేస్తు ండటంతో నీడ కరువవుతుందని పలువురు అంటున్నారు. అసలు చెట్లను నాటడం తప్పా, లేక పెరిగిన చెట్లను నరకడం తప్పా అనే విషయంపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటు న్నారు. వాస్తవానికి చెట్లను పెంచాలే తప్పా తొలగించకూడదు. అధికారుల సమ న్వయ లోపంతో చెట్లకు రక్షణ కరువైంది. రుద్రూరు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ కాలనీలో ప్రధాన రహదారిపై గత రెండు రోజులు క్రితం పచ్చని చెట్లను ట్రాన్స్ కో అధికారులు నరికివేశారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా వస్తున్నాయనే ఉద్దేశంతో పచ్చని చెట్లను నరికి వేశారని కాలనీ వాసులు తెలిపారు. అంతేకాకుండా నరికి చెట్లను, చెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా రోడ్లపైనే వేశారు. నీడనిచ్చే చెట్లు నేలకొరిగాయి. పచ్చని చెట్లను నేలకూల్చిన


పెరిగిన పచ్చని చెట్లను నరికిన విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ శాఖ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఏదేమైనా పర్యావరణ సమతుల్యతకు చెట్లు నాటడం, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుంచుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

పసుపు పంటకు రూ.15వేల మద్దతు ధర కల్పిస్తాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్10: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పసుపు పంటకు రూ.15వేల కనీస మద్దతు ధర కల్పిస్తామని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్ మండలం లక్కోరలోని ఎస్‌జీ గార్డెన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే పంటలకు మద్దతు ధర కోసం జాతీయస్థాయిలో చట్టబద్దత కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీనవర్గాలు, రైతుల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బడావ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులకు సంబంధించి రూ.2లక్షల కోట్ల రుణాన్ని మాఫీ చేయడకుండా బడావ్యాపారులకు రూ.16లక్షల కోట్ల మొండి బకాయిలు ఏలా మాఫీ చేశారని ప్రశ్నించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే జాతీయస్థాయిలో రైతులకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ సంపాదించిన సంపాదనను నరేంద్రమోదీ గుజరాత్ వ్యాపారస్తులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చి ఆరు నెలలైన ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ప్రకారం పసుపు పంటకు రూ.15వేల మద్దతు ధర కల్పిస్తామన్నారు. మెడిగడ్డలో అదనంగా పది టీఎంసీల నీటిని వృధాగా వదిలే బదులు అప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి మళ్లిస్తే శ్రీరాంసాగర్‌లో నీటి కొరత ఉండేది కాదన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మించామన్నారు. మతం పేరుతో నిర్మించే వారికి ఓటు వేయవద్దని కోరారు. గత పదేళ్ళ కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించేది కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ నాయకులు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్, మండవ వెంకటేశ్వర్‌రావు, అరికెల నర్సారెడ్డి, గడుగు గంగాధర్, మానాల మోహన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్, వినయ్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'నరేంద్రమోదీ వైపే దేశప్రజలంతా చూస్తున్నారు'

పెద్దబజార్, ఏప్రిల్ 10: ప్రధాని నరేంద్రమోదీ వైపే దేశప్రజలంతా చూస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు రెండు ఒక్కటేనని ఇందూరు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. తెలంగాణలో ఎన్నికలు చూస్తుంటే కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు ఏకమవుతున్నాయని కానీ గెలుపు మాత్రం బీజేపీకే సాధ్యమని ప్రజలు నిజాయితీకే పట్టం కడుతున్నారని ధీమావ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సిద్ధాంతాలు లేవు. కేవలం మైనార్టీల ఓట్లే కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఒక మైనార్టీ నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంట్ అనేది కాంగ్రెస్‌కు ఇచ్చామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగునీరు, తాగునీరు కోసం రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రూపాయి ఇచ్చింది లేదని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి నిలబడ్డ జీవన్‌రెడ్డి ఇఫ్తార్ విందులో ఫోటోలకు ఫోజులు ఇస్తూ ఓట్లు మాకేనని చెప్పగానే చెబుతున్నారని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ కూడా టోపీలు పెట్టుకొని ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నారని అన్నారు. బీజేపీ పార్టీకి కులం, మతం లేదని చిట్టచివరి వరకు అందరి కోసం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఎన్నుకొని దాదాపు నాలుగు నెలలు కావస్తుందని నాలుగు నెలల్లో ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. రైతులు 1700 క్వింటాలుకు వడ్లను అమ్ముకొనే పరిస్థితి తలెత్తిందని రైతులు నష్ట



మాట్లాడుతున్న దినేష్‌కులాచారి

పోతున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జిల్లాకు ఏం చేశారని దీని కోసం రోజు బహిరంగ సభ చర్చకు పిలిచిన మేము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. తాము గత ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చినట్టుగానే పసుపు బోర్డు తెచ్చామని అన్నారు. నేడు పసుపు ధర 20వేలు పలుకుతుందని అన్నారు. అలాగే నేడు 7ఆర్‌వోబీ బ్రిడ్జిలు సాంక్షన్ చేయించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గద్దెభూమన్న, శ్రీనివాస్‌శర్మ, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, బద్దం కిషన్, రోషన్‌లాల్‌బోరా, రాజశేఖర్ రెడ్డి, దొంతుల రవి, మీసేవా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు


గొట్టుముక్కలలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

మాక్లూర్ ఏప్రిల్10: మాక్లూర్ మండలం గొట్టుముక్కల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్టు పశువైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, డాక్టర్ ఉమసాహెర్‌లు తెలిపారు. సుమారు 400 పశువులకు టీకాలు వేసినట్టు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది లినిత, మైమద్ పాషా, జైత్రి, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులకు ఆకర్షితులయ్యాం '

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్10: భీమ్‌గల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లెల రాజశ్రీ లక్ష్మణ్ బుధవారం లక్కోర లోని ఎస్‌జి ఫంక్షన్ హాల్ లో ఎంపి అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బాల్కొండ నియోజక వర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజక వర్గంలో పార్టీ పటిష్టతకు పనిచేసే జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్వామి

పెద్దబజార్, ఏప్రిల్ 10: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాదాసు స్వామియాదవ్ రెండవ సారి నియమితులయ్యారు.నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చ కమిటీలో అధికార ప్రతినిదులు స్వామియాదవ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ ఒక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ ఓబీసీ మోర్చ విభాగం బాధ్యతలు చేపట్టిననాటి నుంచి పార్టీని విస్తృతంగా తీసుకెళ్లేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం ఓబీసీల కోసం తీసుకొచ్చిన పథకాలు ప్రజల్లోకి చేర్చడంతో వవంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ శాసనసభ పక్షనేత యెండల లక్ష్మీనారాయణ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

పనుల చోట కూలీలకు వసతులు కల్పించాలి

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 10: జాతీయుపాదిహామిపథకం పనులచోట కూలీలకు అన్నివసతులు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తచెరువు తాండా గ్రామ శివారుల్లో కొనసాగుతున్న ఉపాదిహామిపథకం పనలను ఆయాన క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీలకు, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు. అంతకు ఎమ ఉందు కోనాపూర్, డిసి తాండా గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నుండి ఉపాది నిమిత్తం రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటున్న యూనిట్లను, తాగునీటి సరఫరా ట్యాంక్‌లను ఎంపీడీవో పరిశీలించి నీటిసరఫరాను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తెలత్తకుండా ఎప్పటికప్పడు యుద్దప్రాతిపాదికన తగు జాగ్రత్తలు చేపట్టాలని లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఆయన వెంట గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయితి కార్యదర్శులు ఉన్నారు.

రంజాన్ మాసం చాలా పవిత్రమైనది

బోధన్‌రూరల్‌ఏప్రిల్10: సాలూర మండల కేంద్రంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ మైనారిటీ సోదరులకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షల సందర్భంగా వారికి ఫలహారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైందని, ఎంతో కఠినమైన ఉపవాసాలను పాటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేజీ గంగారాం, స్వామిగౌడ్, ఇల్తెపు గంగారాం, దత్తు, శివకాంత్ పటేల్, శివరాజ్ పటేల్, లక్ష్మణ్, రాజేశ్వర్, శ్రీరాం, గంగాదర్, సాలూర షకీల్, యుసుఫ్, ఖదర్‌లతో మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

మోర్తాడ్, ఏప్రిల్10: మండలంలోని పాలెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యా ర్థుల కు సైబర్ నేరాల పై పోలీసులు అవగా హ న కల్పించారు. ఏఎస్సై గోపాల్ మాట్లా డుతూ పాఠశాల విద్యా ర్థులు సైబర్ నేరాలపై, షీటీంలపై అవగాహన కల్పిం చారు. మొబైల్‌ఫోన్ అధికంగా వడకూడదని గుర్తు తెలియని వ్యక్తులు పంపించే సమాచారాన్ని ఎవరికి చేరవేయ వద్దంటు విద్యార్థులకు వివరిం చారు. తమ ఫోన్‌లోకి వచ్చిన ఓటీపీలను ఎవరికి చెప్పవద్దంటు విద్యార్థు లకు తెలిపారు. సైబర్ వలలో చిక్కిన వారు ఎవరైనాఉంటే 1930 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలంటు తెలిపారు. విద్యార్థులకు సైబర్ నేరాలపై పలు ప్రశ్నాలు నిర్వహించగా ఉత్తమ సమాచారం తెలిపిన విద్యార్థులకు మెమెంటోలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్‌రావు, ఉపా ధ్యాయులు మగ్గిడి శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

అన్ని వర్గాల అభ్యున్నతే మోదీ లక్ష్యం

● ఎంపీ అర్వింద్

బోధన్‌రూరల్,ఏప్రిల్10: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రధానమంత్రి మోడీ లక్ష్యమని, అవినీతికి దూరం, అభివృద్దే ధ్యేయంగా ప్రధానమంత్రి దేశ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, నిజాయితీ దేశాన్ని నడిపించేది మోడీనేనని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. బుధవారం సాయంత్రం బోధన్ పట్టణంలోని బీటీ నగర్‌లో కాలనీవాసులతో కలిసి చాయ్‌పే చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు రేషన్ కార్డులు, ఇళ్లు, ఫ్రీ కరెంట్ రావడం లేదని ఎంపీ అరవింద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ పార్టీకి గరిబోళ్ల ఉసురు తగులుతుందన్నారు. ఆరు గ్యారంటీలు అని ప్రజలను మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేసిందని ఇప్పుడు కవిత జైలులో ఉందని ఇదేలా దోస్తీ అవుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఓవైసీల దోస్తీల ఒక్కటేనని మైనారిటీల ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రజలను మభ్య పెడుతుందన్నారు. ప్రజలు అడగని హామీలను బోధన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని మరి ఇప్పుడు తులం బంగారం, అత్త కోడళ్లకు పింఛన్‌లు, రేషన్ కార్డులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని, బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. బంగ్లాదేశీయులు తమ రోహింగ్యాల ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వారి కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, బీజేపీ నాయకులు శంకర్, సుధాకర్ చారి, నరసింహ రెడ్డి, దామోదర్, బాలరాజు, శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ నాయకులు పసులోటి గోపికిషన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: పసుపు, మామిడి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని నడిమిగైని మున్నూరుకాపు సంఘం వద్ద బుధవారం హోటల్‌లో చాయ్‌పే చర్చ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొని రైతులు, స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు పసుపు, జగిత్యాల జిల్లాకు మామిడిని వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. ఈ రెండు పంటల ఎగుమతులపై కేంద్రం చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగానే పసుపును ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతో రైతులకు మంచి ధర లభించిందన్నారు. పసుపుబోర్డు వస్తే విత్తనాలు, భూసార పరీక్షలతో పాటు అన్ని అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. పరిమితులకు లోబడి ఎరువులను వాడితే పసుపు ఎగుమతులకు డిమాండ్ ఏర్పడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీంతో గోదాంను, పసుపుశుద్ది కార్మగారాలు, రైతులు వినియోగదారులను కలిపే వ్యవస్థ ఏర్పాటవుతుందన్నారు. దీని వల్ల రైతుల వద్దకే కొనుగోలుదారులు వచ్చి పంటను కొనేలా వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. జిల్లా కేంద్రంలో కేవలం ఒకే రైల్వే ఓవర్‌బ్రిడ్జి ఉందని, తాను వచ్చాక ఏడు తీసుకువచ్చానన్నారు. గత ప్రభుత్వం అవినీతి కారణంగానే చక్కెర పరిశ్రమలు తెరుచుకోవడంలేదని ఎంపీ అర్వింద్ విమర్శించారు. తెలంగాణలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు నిజా మాబాద్ అనువైన ప్రదేశమన్నారు. మోదీ ప్రభుత్వం రాక ముందు వరి క్వింటా లుకు రూ.1300 మద్దతు ధర ఉండేదని, ప్రస్తుతం రూ.2వేలు దాటిందన్నారు. నిజామాబాద్ మార్కెట్ యార్డు తెలంగాణలోనే పెద్దదని పసుపు లావదేవి మీదనే యార్డుకు ఏటా రూ.10 నుంచి రూ.12కోట్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ నిధులను నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఖర్చు చేయడంలేదని, కొన్నేళ్లుగా సిరిసిల్ల, సిద్దిపేటకు తరలిపోయాయని ఎంపీ


ఆర్మూర్‌లో చాయ్ పే చర్చలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్


బోధన్‌లో ఛాయ్‌పే చర్చలో భాగంగా మాట్లాడుతున్న ఎంపీ

విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు కంచెట్టి గంగాధర్, కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పాలెపురాజు, పుప్పాల శివరాజ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, పొల్కం వేణు, అమ్దాపూర్ రాజేష్, విజయానంద్, పులి యుగంధర్, మందుల బాలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

సదాశివనగర్, ఏప్రిల్ 10: వేసవికాలం దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు వైద్యాధికారిని ఆస్మా తెలిపారు. మండలంలోని కుప్రియాల్ ధాన్యం కొనుగోలు వద్ద సిబ్బందితో ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేశారు. వేసవికి కాలంలో ఎండవేడి నుంచి కాపాడుకోవడానికి వడదెబ్బ నుంచి రక్షించడానికి ఈ ఓఆర్ఎస్ ప్యాకెట్లు బాగా పని చేస్తాయని తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు సరిపడా తాగునీరు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రం నిర్వహకులకు తెలిపారు. దాంతో పాటు వైద్య సిబ్బంది ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.



బ్రాహ్మణ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న దృశ్యం

బ్రాహ్మణ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

నిజాంసాగర్, ఏప్రిల్ 10: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం రూ. 5 లక్షల 45 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలుండటంతో వాహనాలను తనిఖీ చేస్తుండగా, మహారాష్ట్రకు చెందిన సమీర్ హుసేన్ సాబ్ ఖురేషి బొలెరో వాహనంలో నగదును తీసుకెళుతుండగా పట్టుకున్నామన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కాందార్ తాలుకా పట్వాడా గ్రామానికి చెందిన ఖురేషి హైదరాబాద్ నుంచి నాందేడ్‌కు వెళుతున్నాడని వివరించారు.

రెండో రోజు లలితా నవరాత్రి పూజలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో పక్కన బీడీ కాలనీలో భగలాముఖి అమ్మవారి దత్త పీఠంలో నిర్వాహకులు ప్రముఖ జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ లలితా నవరాత్రి రెండో రోజు పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మొట్టమొదట హిమాలయాల్లో ఉన్న భగలాముఖి అమ్మవారి ఆలయం తరువాత తెలంగాణలోని కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కొలువై ఉన్నది అని ప్రముఖ జ్యోతిష్య పండితులు అమ్మవారి పీఠాధిపతి క్రాంతి పటేల్ తెలిపారు. పీఠానికి ఓ ప్రత్యేకతను తీసుకొచ్చారు.

రామాంజనేయ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

గాంధారి, ఏప్రిల్ 10: మండలంలోని గౌరారం రామాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సజ్జనపల్లి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా చాకలి కిషన్, సలహాదారుడిగా బెజుగం అశోక్, పాలకవర్గం అంజయ్య, పద్మ పాపయ్య, కమ్మరి ప్రభు, గాజుల మల్లేష్, బోర్లం శ్రీనివాస్, రెండ్ల బండి రమేష్, మంగలి శంకర్, గుల్ల గంగారాంలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కాంగ్రెస్ పట్టణ, యూత్ కమిటీల ఎన్నికైన

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10: ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడిగా కంచం సిద్ధి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సతీష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా షేక్ పాషా, నజీబ్, ప్రధాన కార్యదర్శిగా కర్రి రమేష్, కార్యదర్శులు కిరణ్, అజయ్‌కుమార్, సుమేర్‌ల కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా పట్టణ ఉపాధ్యక్షుడిగా ఇంతియాజ్, అశోక్, ప్రధాన కార్యదర్శిగా వహీద్, కార్యదర్శులు అంజయ్య, సుధాకర్, కోశాధికారి ప్రసాద్‌గౌడ్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ నీల రవి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎల్లు బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సర్దార్, ఉపాధ్యక్షుడిగా అజ్మీరా సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, సంతోష్, విద్యాసాగర్, చెన్నా లక్ష్మణ్, పాటకుల వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామ ఆలయంలో రామ రక్షా స్తోత్ర పారాయణం

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 10: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని శ్రీరామ ఆలయంలో మహిళలు సామూహిక శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణం గావిస్తున్నారు. ప్రముఖ పురాణవేత్త దత్తు మహరాజ్ రాందాసి గారి ఆధ్వర్యంలో పురాణ కాలక్షేపంతో పాటు పారాయణ కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉగాది నుంచి మొదలుకొని శ్రీరామ నవమి వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని వారు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సదాశివనగర్, ఏప్రిల్ 10: పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న కార్యకర్తను గుండెల్లో పెట్టి కాపాడుకుంటానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. సదాశివనగర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సదాశివనగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేటట్టు కృషి చేయాలని తెలిపారు. బీబీ పాటిల్ ఆధ్వర్యంలో సదాశివ నగర్ మండల గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, గ్రామ అధ్యక్షుడు శామయ్య బాలయ్య, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రూపేందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ నాయకుడు గణేష్‌నాయక్, నాయకులు, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుందాం

రామారెడ్డి: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుందామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. బుధవారం రామారెడ్డి మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. పది సంవత్సరాలుగా రెండుసార్లు ఎంపీగా బీబీ పాటిల్‌ను ప్రజలు నమ్మకంతో గెలిపించారని అయినా అభివృద్ధి పనులు చేయలేదన్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ పశుపతి, ఎంపీటీసీ ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

సదాశివనగర్, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం సదాశివనగర్ మండలం అశోక్‌గార్డెన్‌లో సదాశివనగర్, రామారెడ్డి ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగించి తెలంగాణ అభివృద్ధి బాటలో నడుస్తున్న సమయంలో కల్లబొల్లి హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో చర్చ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింలు, ఎంపీపీ అనసూయ, రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రావు, బుచ్చయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే ఎంతటి నాయకుడైనా ఎదిగేది

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 10: కార్యకర్తల కృషితోనే ఎంతటి నాయకుడైనా ఎదిగేదని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు లింగాపూర్ లక్ష్మీదేవిగార్డెన్ నుంచి కామారెడ్డి పట్టణంలో ప్రధాన వీధుల గుండా భారీగా బైక్‌ర్యాలీని రాజారెడ్డి గార్డెన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీకైన కార్యకర్తలే వెన్నెముక లాంటి వారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో కార్యకర్తలు చేసిన కృషితో మాజీ సీఎం, ప్రస్తుత సీఎంను ఓడించడంతో పాటు దేశమంతటా, రాష్ట్రమంతటా గుర్తింపు వచ్చిందన్నారు. ఏ ఎన్నికైన మద్యం, డబ్బు పంపిణీ చేయందే ఓటు పడని పరిస్థితులు ఉండవనే వ్యాఖ్యలను తప్పని నిరూపించిన ఏకైక కార్యకర్తలు తనకు దొరకడం అదృష్టమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వార్ వన్‌సైడే అని ప్రజలందరూ బీజేపీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. తనను కామారెడ్డి నియోజకవర్గంలో 70వేల ఓట్లతో గెలిపిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు లక్షా 20 వేల ఓట్లు వచ్చేవిధంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనుతరం ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ మాట్లాడుతూ బూత్ స్థాయిలో బీజేపీ బలంగా ఉందని, ప్రతీ కార్యకర్త తన బూత్‌లో 50 శాతం ఓట్లు సాధించేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తలు నిబద్ధతతో పని చేస్తారని అసెంబ్లీ ఎన్నికలలో నిరూపించారని అదేస్ఫూర్తితో పని చేసి జహీరాబాద్ ఎంపీగా తనకు మద్దతు పలికి భారీ విజయాన్ని అందించాలని కోరుతున్నామన్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేసి ఎలాగైతే దేశంలో, రాష్ట్రంలో చర్చకు వచ్చేలా చేశారో జహీరాబాద్ ఎంపీగా తనను గెలిపించేందుకు కృషి చేస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ సారి బీజేపీకి 400 సీట్లు రావడం ఖాయమని అందులో జహీరాబాద్ సీటు కూడా ఉండాలని కార్యకర్తలను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు నీలం చిన్న రాజులు, లక్ష్మారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నసురుల్లాబాద్‌లో కుస్తీ పోటీలు



నసురుల్లాబాద్ కుస్తీ పోటీలో పాల్గొన్న మల్లయోధులు

నసురుల్లాబాద్, ఏప్రిల్ 10 : ఉగాది పండుగను పురస్కరించుకుని రెండవ రోజు, నసురుల్లాబాద్ మండల కేంద్రంలో, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలకు చుట్టు పక్కల మండలాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు మల్ల యోధులు తరలివచ్చారు. కుస్తీ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు అందజేసిన గ్రామ కమిటీ సభ్యులు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కుస్తీ పోటీలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దకాపు అయినాల లచ్చయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేష్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు బోధనం సాయిలు, మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, మాజీ ఎంపీటీసీ కిష్టాగౌడ్, చుంచు సాయిలు, మైషాగౌడ్, గ్రామ పెద్దలు, యువకులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో ఈ కుస్తీ పోటీలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పిట్లం, ఏప్రిల్ 10: జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో పిట్లం, పెద్దకోడప్గల్ మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, మాజీ జడ్పీ చైర్మెన్ ధపేదర్‌రాజు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గాలి అనిల్‌కుమార్ అభ్యర్థిని నియమించడం జరిగిందని, ప్రతీ కార్యకర్త బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు గడపగడపకూ తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపునకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ ప్రజలు తనను ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని, గెలిచిన అనంతరం పిట్లం వీదుగా రైల్వే ఏర్పాటు చేయిస్తానని, నియోజకవర్గం అభివృద్ధి అందరి సహకారంతో చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మెన్ దపెదర్‌రాజు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, పిట్లం, పెద్దకోడప్గల్ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం



గుర్జకుంటలో ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

భిక్కనూరు, ఏప్రిల్ 10: మండలంలోని గుర్జకుంట గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకున బుధవారం గ్రామదేవతలకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా ముస్తాబుచేసి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలోని గ్రామదేవతల ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపును డప్పుచప్పుళ్ల నడుమ నిర్వహించారు. ఈ మేరకు గ్రామస్థులు మాట్లాడుత ప్రతి సంవత్సరం ఉగాది మరుసటి రోజున గ్రామంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించడం ఆనావాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎల్లారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి బీజేపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు గ్రామాలలో ప్రతి ఓటరుకు వివరించాలని, అలాగే పది సంవత్సరాలలో బీబీ పాటిల్ ఎంపీగా ఉండి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని కూడా వివరించాలని ఆయన అన్నారు. భారతదేశంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోది ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే, పట్టణ జనరల్ సెక్రటరీ రాజేష్, మహేందర్, సతీష్, బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్, ఎస్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవులు పాల్గొన్నారు.

విద్యార్థులు అభద్రత భావానికి లోనుకావద్దు

● మానసిక వైద్య నిపుణులు రమణ

భిక్కనూరు, ఏప్రిల్ 10: విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతామని అభద్రత భావానికి లోనుకావొద్దని మానసిక వైద్య నిపుణులు రమణ సూచించారు. బుధవారం మండలంలోని సిద్దరామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మానసిక సమస్యలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల విద్యార్థుల్లో ఏర్పడుతున్న మానసిక ఆందోళనలను అధిగమించడమే ఈ అవగాహన కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. విద్యార్థుల రోజువారి దినచర్య, పరీక్ష ప్రణాళికకు అనుగుణంగా చదువుతకోవడంలో మార్పులు, పరీక్ష సమయాల్లో ఒత్తిడికి గురికావడం, పరీక్షల్లో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు అధిగమించాల్సిన తీరు, భ్రమల్లో గడపకుండా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు ఊహించుకోవడం, తదితర అంశాలపై విదార్థులకు వివరించారు. ఎవరికైనా మానసికి సమస్యలు తలెత్తితే 14416కి కాల్ చేయాలని, తద్వారా ఉచిత కౌన్సిలింగ్ పొందవచ్చునన్నారు. అనంతరం పాఠశాలలో మానసిక సమస్యలతో బాధపడుతున్న 35మంది గుర్తించి వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సాయన్న, జిల్లా మానసిక ఆరోగ్య సామాజిక కార్యకర్త వంగ రాహుల్, హెల్త్ సూపర్‌వైజర్ దీవెన పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 10: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఒకరికి ఎల్‌వోసీని డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన నాగర్తి నర్సారెడ్డికి మోకాళ్ల శస్త్రచికిత్స నిమిత్తం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సహకారంతో రూ.లక్షా30వేల ఎల్‌వోసీ మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

26 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూ నివర్సిటీలో 2017 సంవత్సరానికి ముందు డిగ్రీలో చేరిన విద్యార్థులు పునఃప్రవేశం పొందిన వారు బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 26 చివరి తేదీ అని అధ్యయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు.

'మోదీ పాలన చూసి ఓటు వేయండి'

లింగంపేట, ఏప్రిల్ 10: నరేంద్రమోదీ పాలన చూసి జహిరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు ఓటువేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండల కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీబీ పాటిల్ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. బీబీపాటిల్ గత 10సంవత్సరాలుగా ఎంతో అభివృద్ధి చేశారని సౌమ్యుడు ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోనని బీబీ పాటిల్‌కు మూడవ సారి అవకాశం ఇచ్చి నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేసి దేశాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. త్వరలోనే వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ మురళి, బొల్లారం సాయిలు, క్రాంతి, రవీందర్‌రావు, దత్తురాంలు, అశోక్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

మండల పూజ కరపత్రాల ఆవిష్కరణ

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 10: పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో బుధవారం శ్రీ హనుమాన్ దీక్షా స్వాముల సామూహిక మహా మండల పూజా కరపత్రాలను ధర్మకర్త పరిగె శంభురెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయ ఆవరణలో సామూహిక మండల పూజా మహోత్సవం ఉంటుందన్నారు. హనుమత్ దీక్షా పీఠాధిపతులు శ్రీ దుర్గా ప్రసాద్ స్వామీజీ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. విశిష్ట అతిథిగా మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమ వివరాలు తెలుపుతూ గణపతి హోమం, లక్ష నాగవల్లి దళార్చన, లక్ష హనుమాన్ చాలీసా పారాయణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అభిషేకాలు, అర్చనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ, హనుమాన్ దీక్ష గురుస్వాములు అంబిల్‌పూర్ రాజు, దత్తు, ఉమామహేశ్, శంకర్, సాయికుమార్, నవీన్, శ్రీనివాస్, నరేష్, సాయిబాబా, కిరణ్, దీక్షా స్వాములు తదితరులున్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 10 : పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని బుధవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త నడుం బిగించి పని చేయాలన్నారు. బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు గ్రామ గ్రామాన ఓటర్లకు వివరించాలన్నారు. బీబీ పాటిల్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి బాపూరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రరావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, మండల పార్టీ అధ్యక్షులు సత్య బోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి తరలివెళ్లిన బీజేపీ నాయకులు

దోమకొండ, ఏప్రిల్ 10: కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన బైక్‌ర్యాలీకి దోమకొండ మండలం నుంచి భారీ ఎత్తున బైక్‌లతో తరలివెళ్లినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి తెలిపారు. బైక్‌ర్యాలీ దేవునిపల్లి లక్ష్మీదేవిగార్డెన్, జన్మభూమిరోడ్డు, కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరాస్తా, కమాన్ మీదుగా రాజారెడ్డి గార్డెన్ చేరుకుంటుందని, అక్కడ నిర్వహించే సమావేశంలో దోమకొండ మండల నాయకులు, కార్యకర్తలు హాజరైనట్లు తెలిపారు. తరలివెళ్లిన వారిలో రవీందర్‌రెడ్డి, చింతల రాజేష్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నత్తి గణేష్, ఎస్‌పాల్, జగదీష్, కంది మనోజ్ కుమార్, రామ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గుడిసెల దగ్ధం

లింగంపేట, ఏప్రిల్ 10: మండలంలోని కొండాపూర్ తండాలో బుధవారం విద్యుదాఘాతంతో మూడు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. తండాకు చెందిన మంజ గులాబ్, సింగ్ పశువుల కొట్టం దగ్ధం కాగా మంజ బద్య, మంజ రతన్‌సింగ్‌ల గుడిసెలు దగ్ధమయ్యాయి. మంజ బద్య ఇంట్లో 60 తులాల వెండి, అర తులం బంగారం, వంట పాత్రలు, కాలిపోగా, మంజ రతన్‌సింగ్ ఇంట్లో 10వేల నగదు, వడ్లు, మక్కలు, వంట సామగ్రి, బట్టలు కాలి బూడిదయ్యాయి. ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. సంఘటన స్థలానికి లింగంపేట ఏఎస్సై ప్రకాశ్ వెళ్లి సహాయక చర్యలను చేపట్టారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ బాధితులకు బట్టలు, వంట సామగ్రి పంపిణీ చేశారు.

చేపల చెరువులో పడి ఒకరి మృతి

లింగంపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని నారాగౌడ్ చేపల చెరువులో పడి గాంధారి మండలం రాంలక్ష్మణ్‌పల్లికి చెందిన అజ్మీరా రవి(24) మృతి చెందాడు. మంగళవారం చేపల చెరువులో రవి అతని తల్లి భూరిలు చేపలు పట్టడానికి వెళ్లారు. రవి చేపలు పడుతుండగా భూరి ఒడ్డుపై కూర్చొని ఉంది. కొద్ది సేపటి తరువాత రవి కనిపించకుండా పోయాడని నీటిలోను, చుట్టుపక్కల కనిపించలేదని ఇంటికి వెళ్లి వెతికినా కనిపించకపోవడంతో బుధవారం ఉదయం భూరి వెళ్లి చేపల చెరువు వద్ద చూడగా చెరువులో తేలుతూ కనిపించాడని ఆమె పోలీసులకు పిర్యాదు చేసింది. చేపలు పడుతూ నీటిలో మునిగి బురదలో ఊపిరి ఆడక చనిపోయాడని ఆమె పిర్యాదు చేసినట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలియజేశాడు.

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

దర్శన్ - ప్రాజెక్ట్(జెడ్)
శాంతి - టిల్ స్క్వేర్
ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్

బాన్సువాడ

మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర - లవ్‌గురు

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

